వేదుల చిన్న వేంకట చయనులు - నవ్య వీక్లి కథల పోటీలో

## విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ

కారు పెళ్లిపందిరి ముందు ఆగింది. పందిరంతా కళకళలాడుతోంది. బంధు జనంతో కిటకిటలాడుతోంది. నాలో అనిర్వచనీయమైన ఉద్వేగం. ఉత్సాహం. అరక్షణంలో కారులోంచి దిగేను.


చురుక్కుమనిపిస్తోంది ఎండ. ఉదయం పది గంటలకే అదరగొట్టేస్తోంది ఎండ.

పందిట్లో, అంతమందిలోను, నాన్నని క్షణంలో గుర్తు పట్టేయగలిగేను. నా పెదాలపై నవ్వు పువ్వులా విచ్చుకుంది. ఉవ్వెత్తున ఆనందం ఎగిసి పడగా, ఉద్వేగంతో 'నాన్నా' అని పిలిచేను. ముప్పయ్యేళ్ల దాన్ని మూడేళ్ల దాన్నయిపోయేను.

నాన్న నన్ను చూడలేదు.

మరోసారి పిలిచేను గట్టిగా.

అంతా నావైపే చూస్తున్నారు. నాన్న మాత్రం నావైపు చూడటం లేదు. ఎటో చూస్తున్నాడు!



# ప్రేమ...బంధం

అర్నాద్

సరిగ్గా ఆ సమయంలోనే 'అక్కా' అంటూ పరుగున వస్తున్నాడు గోపి... పెళ్లికొడుకు.

వస్తున్నవాడు హఠాత్తుగా ఆగిపోయి బొమ్మలా వుండిపోయేడు. 'ఆగు' అనే ఒక పెనుకేక, కసుక్కుమని వెన్నులో దిగిపోయిన కత్తిలా అతణ్ణి ఆపేసింది.

పందిట్లోకి అడుగు పెట్టనీయకుండా నన్నూ ఆపేసింది అమ్మ పెనుకేక. నాపై విరుచుకుపడి, ఒకప్పటి సినిమా సూర్యకాంతంలా గొంతు చించుకు అరుస్తోంది అమ్మ.

ఎన్నాళ్లకు అమ్మగొంతు విన్నాను.

ఇంటిలోపల... ఎక్కడనుంచో కాకుండా... అదేదో ఎదురుగా వచ్చి తిడితే... నా బంగారు అమ్మను కళ్లలో తడిమి తడిమి తనివితీరా చూసుకుందును కదా.

పందిట్లో నాన్న అచ్చం సూర్యకాంతం సినీ మొగుడు రమణారెడ్డి ఫక్కీలో ఊపిరాడనట్టు బిక్కచచ్చిపోయి, ఇంకా ఎటోచూస్తూ, నేల దిగేసిన రాటలా నించుండిపోయేడు. నాన్న నన్ను 'ఫో' అనలేడు. లోనకి 'రా' అనలేడు. అమ్మను ఏమీ అనలేడు. అవును అమ్మ ముందు నాన్న డూడూ బసవన్న.

పెళ్లికొడుకు పరిస్థితీ అంతే. అమ్మకు వ్యతిరేకంగా నోరు మెదపలేడు. నా దగ్గరకు రాలేడు.

నేను ఎండలో అలా నించుండిపోయేను. ఇంటి గుమ్మంలోకి కాదు,

పందిరి నీడలోకి కూడా అడుగెట్టలేని నిస్సహాయ స్థితిలో వున్నాను.

అక్కడున్న మా బంధు జన పరివారమంతా నన్నొక శాపగ్రస్తులా చూస్తూ వుండి పోయేరు. ఏ ఒక్కరూ కలుగజేసుకునే సాహసం చేయలేక పోయేరు.

ఎండ దెబ్బ, అంతకుమించి అక్కడ వాతావరణం నన్ను నిలువునా కృంగ దీసేయి. నీరసం ఆవహించింది. స్పృహతప్పి కిందపడిపోతే... ఏ ఒక్కరైనా పరుగున వచ్చి లేవనెత్తుతారా?

నెమ్మదిగా కారుని ఆశ్రయించేను. బహుశా నేను కదిలేవరకూ పందిట్లో గాలి ఆడి వుండదు.

అమెరికా నుంచి ఆరేళ్ల తర్వాత వచ్చేను. ఊరు మారింది. మనుషులు మారలేదు.

***

ఒక గంట తర్వాత –

పెళ్లికొడుకు గోపి పరుగున వచ్చేడు. వచ్చి నా చేతులు పట్టుకున్నాడు. ఉదయం పందిట్లో నాకు జరిగిన అవమానానికి సిగ్గుపడి, బాధపడి ఏడ్చేడు.

''నోర్మూయ్యిరా, నన్నెవరు తిట్టారు. అమ్మే కదా. దానికి సిద్ధపడే వచ్చేను'' – నవ్వుతూ తమ్ముణ్ణి సముదాయించేను.

అమెరికా నుంచి వచ్చిన నన్ను... ఉదయం నాలుగ్గంటలకే రిసీవ్ చేసుకుని... ఇదిగో ఈ స్టార్ హోటల్లో బంధించేసాడు గోపి.

''అక్కా! కాసేపు విశ్రాంతి తీసుకో. తర్వాత ఇంటికి తీసుకువెళ్తాను'' అన్నాడు. వాడు వచ్చేవరకూ ఆగలేక... ఎంతవేగిరం నా బంగారు అమ్మను చూస్తానా అనే తహతహతో వెళ్లి.... ఆలోచించేను. ఇక పెళ్లి పందిట్లో అడుగుపెట్టే అవకాశం నాకు ఏ మాత్రం లేదు గనుక... గోపిని చిన్న కోరిక కోరేను.

''మన బంధువులందరనీ తీసుకురాగలవా. సాయింత్రం ఒక చిన్న గెట్ టు గెదర్. అల్పాహార విందు. నాకీ సాయం చేయగలవా''.

''గలను'' అన్నాడు గోపి కాన్ఫిడెంట్‌గా.

ఆ సమయంలో పెళ్లికి సంబంధించిన కార్యక్రమాలు లేవు.

***

పెళ్లి పందిట్లో సందడి అంతా... సాయంత్రం ఆ హోటల్లో, విశాలమైన హాలులోకి... చల్లచల్లగా దిగిపోయింది. నా ఊహలకు మించి, వచ్చిన బంధువుల సంఖ్య చూసి అబ్బుర పడ్డాను. ఆనందించేను.

వచ్చినవాళ్లనందరినీ హృదయపూర్వకంగా ఆహ్వానించేను. పేరు, పేరునా ఆప్యాయంగా వరసల పెట్టి పిలిచి, ఆత్మీయంగా దగ్గరకు తీసుకున్నాను. పెద్దల కాళ్లకు వినయ పూర్వకంగా నమస్కరించేను.

అల్పాహార విందు అయి – బంధువులంతా రిలాక్స్‌డ్‌గా ఆశీనులయ్యేక, వాళ్లకు అభిముఖంగా నిలబడి – నా మనసులో దొలుస్తున్నదంతా సవినయంగా చెప్పుకున్నాను.

''నేను మా అమ్మని బంగారు అమ్మగా పిలుస్తా నన్న విషయం మీకందరికీ తెలుసు. అంతటా బంగారు అమ్మ నన్ను ఛీకొట్టి దూరమయిన ఉదంతం, దానికి సంబంధించిన విషయాలు మీకు కొంతలో కొంత తెల్సినవే అయినప్పటికీ... ఆ విషయాన్ని నా పాయింట్ ఆఫ్ వ్యూలో నిజాయితీగా మీకు చెప్పదలుచుకున్నాను. సహృదయంతో నన్ను అర్థం చేసుకుంటారని భావిస్తున్నాను.

రెండు పదుల వయసుదాటి, అమెరికా చదువులకు వెళ్లేటంతవరకూ... అమ్మ చెంగు వదల్లేదు నేను. మర్రిచెట్టులా అమ్మనీడ విశాలంగా, హాయిగా, చల్లగా నాపై ఎప్పుడూ, ఎల్లప్పుడూ పరుచుకునే వుండేది.

స్కూల్ బస్ దిగి, బస్తాడు పుస్తకాలు మోసుకొని వస్తున్న నన్ను చూసి 'అమ్మ కూతురోయ్' అంటూ విలవిల్లాడిపోయి, చేస్తున్న పని వదిలేసి, పరుగున



వచ్చి నా చేతిలో సంచి తీసుకునేది. మరోవైపు నన్ను ఎత్తుకునేది. ఇంటి లోపలికి తీసుకువచ్చి, దుస్తులు మార్చి తినడానికి ఏదో ఇచ్చి... ఇవ్వడం కాదు తినిపించేది. బుద్ధిగా తినేదాన్ని కాదు. ఇల్లంతా పరిగెట్టించి .... నాలుగుముద్దలు తినడానికి గంటకిపైగా ఏడిపించే దాన్ని. నా విపరీతమైన అల్లరి సహిస్తూ, భరిస్తూ ఎంతగానో ముద్దు చేసేది అమ్మ.

అమ్మ తినిపిస్తేగాని నాకు ముద్ద దిగదు. అమెరికా వెళ్లేటంతవరకూ నాకు అమ్మ గోరుముద్దలే. నా కంట్లో నలుసు పడితే అమ్మ గుండెల్లో గుబులు రేగేది. నాకు ఎందరో స్నేహితులున్నారు. కాని వాళ్లంతా నాకు అమ్మ తర్వాతే.

అమ్మను విడిచిపెట్టి నేను హాస్టలు చదువులు చదవలేదు. ఇంజనీరింగ్ కూడా వున్న వూళ్లోనే చదివేను. ఎం.ఎస్. చేయడానికి అమెరికా వెళ్లేటంత వరకూ నేను అమ్మను వదల్లేదు.

అమ్మను వదిలి అమెరికా వెళ్లడం నాకు ఏ మాత్రం ఇష్టం లేదు. ఇక్కడే ఏదో ఉద్యోగం చేసుకుంటానన్నాను. అమ్మ చూపించిన వాడిచేత మెడలో తాళి కట్టించుకుంటానన్నాను. వీలైతే ఇల్లరికం అల్లుణ్ణి చూడు. లేకుంటే నీవు మాతోనే వుండాల్సి వస్తుంది అన్నాను. అమ్మతో నేను అంతగా అతుక్కుపోయేను.

'అదేం కాదు, నా కూతురు అమెరికా వెళ్లాల్సిందే' అని డిక్లేర్ చేసేసింది. పట్టుపట్టి బలవంతంగా నన్ను అమెరికా చదువులకు విమానం ఎక్కించేసింది అమ్మ.

అమ్మ చెంగు వదలి... ఒక్కసారిగా సొంతకాళ్లపై నిలబడాల్సి రావడంతో బేజారెత్తిపోయేను. ఎవరితోనూ చెప్పుకోలేని ఒక భయం. అభద్రతా భావం. ఏడుపొచ్చేసి అమ్మ చెంతకు వచ్చేయాలనిపించేది. రెండు మూడుసార్లు వచ్చేయడానికి సిద్ధపడినా అమ్మ ఒప్పుకోలేదు.

నాకు ఎంతగానో ధైర్యం చెప్పేది. క్రమక్రమేణ అమ్మ నుంచి నేపొందిన ఓదార్పు, ప్రోత్సాహం నన్ను నిలదొక్కుకునేలా చేసేయి.

నిశ్చింతగా సెటిల్ అయ్యేను. నిలదొక్కుకున్నాక... ఎదురుగా నాగరిక ప్రపంచమంతా అత్యంత అద్భుతంగా, చైతన్యవంతంగా కన్పించింది. కొత్త జీవితాన్ని పూర్తిగా ఆస్వాదించేను. మానసికంగా ఆరోగ్యవంతంగా ఎదిగేను.

ఆత్మవిశ్వాసంతో ఒక స్వతంత్ర జీవనానికి అలవడి... నాకంటూ ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఆపాదించుకున్నాను.

నా చదువూ పూర్తి అయిన వెంటనే... మంచి ఉద్యోగం వస్తే అందులో చేరేను.

అమ్మ నన్ను చూసి గర్వపడింది. నా గురించీ మీ అందరితో గొప్పగా చెప్పుకుంది.

అమ్మ చెప్పింది నేను వినేరోజులు పోయి, అమ్మకు నేనే చెప్పే స్థాయికి చేరేను. అందుకు కూడా అమ్మ గర్వించింది.

ఉద్యోగం చేస్తుండగా... నా జీవితంలోకి 'అబ్బూ' ప్రవేశించేడు. అతడే నా ప్రపంచం అయ్యేడు. అబ్బూ నాకు లభించడం ఒక అద్భుతం. నా అదృష్టం.

అమ్మ ప్రేమను ఎంతగా ఆస్వాదించానో... అబ్బూ ప్రేమను కూడా అంతగా ఆస్వాదిస్తున్నాను. అతడు లేని జీవితం వూహించుకోవడం కష్టం. బతుకు వ్యర్థం.

అబ్బూ నాకు ఆనందం ఇస్తుంటే... నా ఆనందాన్ని మా కుటుంబం... ముఖ్యంగా నా బంగారు అమ్మ పంచుకోలేకపోయింది.

సంప్రదాయబద్ధంగా పెళ్లి చేసుకోకుండా... అబ్బూతో కలిసి జీవించడాన్ని మా అమ్మా, నాన్న సహించలేక పోయేరు. ఆమోదించలేక పోయేరు.

కారణం.. ప్రేమతో 'అబ్బూ' అని పిలవబడే నా అబ్దుల్లా పాకిస్తాన్ జాతీయుడు కావడం!

అమ్మా, నాన్న దిగ్భ్రమ చెందేరు. తల్లడిల్లిపోయేరు. నెత్తినోరుకొట్టు కున్నారు. నా ప్రియమైన అబ్బూని వదిలేసి, బుద్ధిగా మన కులస్థుడిని పెళ్లిచేసుకోమని శతవిధాల పోరేరు. నేను ఒప్పుకోలేదు. దాంతో అమ్మ తిట్లు, ఏడుపులు, శాపనార్థాలు.

నేను అబ్బూని వదిలి వుండలేనని స్పష్టం చేయడంతో... అమ్మ నాతో తెగతెంపులు చేసుకోడానికి సిద్ధపడింది. తనకు కూతురే లేదనుకుంటానంది. అదెలా?

నాకు అమ్మా కావాలి. అబ్బూ కావాలి.

అమ్మను కావాలనుకుంటే అబ్బూని వదులుకోమంది అమ్మ.

అదెలా సాధ్యం?

అమ్మ చెంగుపట్టుకుని ఇరవయ్యేళ్లకు పైగా నడిచేను. అంతటితో అమ్మ వదిలేయకుండా నన్ను తన బాటలో జీవితాంతం నడిపిస్తాను అంటే ఎట్లా?

నాకిప్పుడు సుఖాన్ని, సంతోషాన్ని, మధురమైన జీవితాన్ని ఇస్తున్నది నా అబ్బూ. అబ్బూతో నడిచే వయసు నాది ఇప్పుడు. అంతే కదా.

అమ్మ సుఖం గతం. అంతమాత్రాన గతం గతించిపోదు. తీయని స్మృతులతో అమ్మ ఆత్మీయ స్పర్శ ఎప్పుడూ నన్ను వెన్నంటే వుంటుంది.

దేనికదే చూడాలి. నా అబ్బూ ప్రేమను అమ్మ ప్రేమతో తూకం వేయడం సరికాదు.

అమ్మ ఒకటి గ్రహించాలి. నేను అమ్మ వద్దలేను. అమెరికాలో వున్నాను. వుంటాను. అక్కడ నాకు నచ్చినట్టుగా వుండగలను కాని, అమ్మకు నచ్చినట్టు ఎలా వుండగలను?

అర్థం చేసుకుని ఆశీర్వదించమన్నాను అమ్మని.

నాపై భగ్గుమంది. మొండిగా, పూర్తిగా నాకు దూరమైపోయింది. నా బంగారు అమ్మ తనకు కూతురే లేదనుకుంది. రేపు తన శవాన్ని కూడా వచ్చి చూడటానికి వీల్లేదు అని శపించింది.

'నా సంతోషం నీ సంతోషం కాదా' అంటే 'నీ సంతోషం నా సంతోషం కాదే వెర్రిముండా. మనం ఏమి చేసినా సమాజం హర్షించాలి. నీవు నన్ను నలుగురిలో తలెత్తుకోనీయకుండా చేశావు కదే' అని గోల పెట్టింది.

అమ్మ దృష్టిలో నలుగురూ అంటే మీరందరూ అవునా. అయితే దయచేసి చెప్పండి. అమ్మని మీ ముందు తలెత్తుకోనీయనంత తప్పు చేశానా? మీరు చెబితే నా తప్పు నేను తెల్సుకుంటాను' అన్నాను. నా కళ్లల్లో నీళ్లు జారిపడకుండా కళ్లు తుడుచుకున్నాను పయిట చెంగుతో.

మా మావయ్య లేచి అన్నాడు. ''నేటి యువతరం కులాంతర, మతాంతర పెళ్లిళ్లు చేసుకుఊరేగుతామంటే, తల్లిదండ్రులకు కష్టంగా తోచినా, తప్పని పరిస్థితుల్లో తలపంకిస్తున్నారు. ఈ మధ్య ఇతర రాష్ట్రీయులనేమిటి, వివిధ దేశీయులను కూడా వివాహం చేసుకునే ఒక కొత్త సంస్కృతినీ, కక్కలేక మింగలేక భరించడం జరుగుతోంది.

అయితే ఈ గ్లోబల్ విలేజ్‌లో నీతో కలిసి జీవించడానికి ఆ పాకిస్తానీ కుర్రవాడు తప్పా మరెవరూ దొరకలేదా తల్లీ.

మరో నలుగురైదుగురు లేచేరు. అదేవిధంగా మాటాడేరు. వాళ్లు చెప్పింది అంతా విన్న తర్వాత దయచేసి కూర్చోమన్నాను. వాటికి సమాధానం చెప్పడం మొదలు పెట్టేను.



## నిప్పు – గాసిప్పు!

నిప్పున్నాక పొగ, నటి అయ్యాక గాసిప్పు ఉండకుండా ఉండాలంటే మనం కొత్తగా మంత్రశక్తుల్ని నేర్చుకుని ప్రయోగించాల్సి ఉంటుంది అని అంటోంది తాప్సి. నిన్నమొన్నటిదాక ఢిల్లీలో స్వేచ్ఛగా తిరిగిన ఈ చిన్నది 'ఝుమ్మంది నాదం' చిత్రంతో టాలీవుడ్‌లో బిజీగా గడుపుతోంది. ప్రభాస్ చిత్రం 'మిస్టర్ పర్ఫెక్ట్', విష్ణు సరసన 'వస్తాడు నా రాజు' సినిమాలతో ఈ తార క్షణం తీరిక లేకుండా ఉంది. ఇంతకీ టాలీవుడ్ గురించి తాప్సి ఏమనుకుంటోంది? ''ఫీలింగ్ సో గ్రేట్. అందం, అభినయం ఉంటే ఇక్కడి వారు బ్రహ్మరథం పడతారని ఎప్పుడో ఎవరో చెబితే విన్నాను. ఇప్పుడు కళ్లారా చూస్తున్నాను. ఇక్కడ వర్క్ కల్చర్ కూడా చాలా బాగుంది. కాకపోతే ఆదిలో గాసిప్స్ కాస్త కలవరపెట్టాయి. ఇప్పుడు వాటి గురించి నేనసలు పట్టించుకోవట్లేదు. వాటి గురించి ఆలోచించే తీరిక కూడా లేదు. అయినా బిజీ నటి అన్నాక ఆ మాత్రం గాసిప్స్ షికారు చేయాల్లెండి'' అంటూ చిలిపిగా కన్నుగీటుతోందీ చిన్నది.

మీరువేసిన ప్రశ్నలన్నీ తొలివే. నాకు నేను వేసుకున్నవే. నన్ను ఇబ్బంది పెట్టినవే.

నేను ప్రేమించిన అబ్బూ పాకిస్తానీ అని తెలియగానే తుళ్లిపడ్డాను. అతని ప్రేమకి ఒక నమస్కారం పెట్టి భయంతో, ద్వేషంతో దూరంగా జరిగేను. కాని అతడి గాలి తగలకుండా జీవించడం నాకు దుర్భరమయ్యింది. అయ్యో! నా అబ్బూ పాకిస్తానీ కాకుండా వుంటే ఎంత బాగుణ్ణు అనుకున్నాను. ఏడ్చేను.

అబ్బూ పరిస్థితి కూడా అదే. అతడు నన్ను వదలలేదు.

'నా ప్రేమను నిరాకరించడానికి పాకీస్తానీయుడనే కారణం కాకుండా, మరొకటి ఏదైనా చెబితే దూరంగా వుంటాన'న్నాడు. 'ఆ కారణం చాలు' అన్నాను.

''నేను పాకిస్తానీ కావడం నా పాపమా. శాపమా. నీవెందుకలా భయపడుతున్నావ్. నేనొక ఉగ్రవాదిలా కన్పిస్తున్నానా? ఇరుదేశాల ఘర్షణకు, విరోధానికి... ఎక్కడో అమెరికాలో వున్న మనమిద్దరమూ బలి కావాలా? ప్రేమను విడిచి శత్రుత్వం పెంచుకోవాలా? అందులో ఏమైనా అర్థం వుందా?

భారత ఉపఖండంలో ఎన్నో శతాబ్దాలుగా హిందూ, ముస్లిమ్‌లు కలసి మెలసి పరస్పర సహనంతో, సహకారంతో, స్నేహంతో జీవించారనేది పరమ సత్యం. అది కాదనలేని చరిత్ర. 'విభజించు పాలించు' అన్నాడు బ్రిటీష్ వాడు. మొన్నమొన్నటి వరకూ అగ్రరాజ్యాలు రెండూ భారత్ పాక్‌ల మధ్య ద్వేషాగ్ని చల్లారిపోకుండా ఎప్పటికప్పుడు రెండు కర్రలు వేసి రగిల్చేరు. ఇప్పుడు ప్రపంచాధిపతి అమెరికా ముందు మోకరిల్లి బంటులైనాయిరెండు దేశాలు. ఇంకేం మోక్షం. తాలిబన్లు కన్నా భారతీయుల వల్లే పాకిస్తాన్‌కి ప్రమాదమని నమ్మించి భయాందోళనలు కలిగించడమే మా దేశపు విషాద రాజకీయం.

ఇరుదేశాల మధ్య విద్వేష వాతావరణం కృత్రిమం. రాజకీయం. మన ప్రేమ మాత్రం సహజాతి సహజం. మన ప్రేమకు సరిహద్దులు లేవు. కాశ్మీర్ అడ్డుగా నిలబడదు.

ఇక్కడొక విషయం గమనించు. మనమిద్దరం కలిసివుంటే ఇరుదేశాల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటాయా? పోనీ శాంతి నెలకొంటుందా? మన ప్రణయం చట్టరీత్యా నేరమవుతుందా? పోనీ మీడియా ముందు సంచలనం రేపడానికి నీవు నేను సెలబ్రిటీస్ స్థాయి వాళ్లమూ కాదు. అవునా.

మనది కేవలం కుటుంబ సమస్యే. నన్ను కాదనకు. ''నీవు లేకుండా వుండలేను'' అన్నాడు నా అబ్బూ. నా భయాలు అన్నీ ధ్వంసం చేసేడు. నెమ్మదిగా నన్ను ప్రసన్నం చేసుకున్నాడు.

మూడేళ్ల నుంచి మేమిద్దరం ఏ చీకూ చింతాలేకుండా, హాయిగా సహజీవనం చేస్తున్నాం. అబ్బూకి నేనంటే ప్రాణం. నా బంగారు అమ్మ కన్నా మిన్నగా చూసుకుంటున్నాడు. మా మధ్య మతపరమైన ఇబ్బందులు ఏమీ లేవు.

నాన్న, తమ్ముడు నన్ను అర్థం చేసుకున్నారు. అయితే ఆ విషయం అమ్మ ముందు ప్రకటించి ఆమెను బాధ పెట్టలేదు. నేను అర్థం చేసుకోగలను.

ఆరేళ్ల తర్వాత వచ్చేను. అమ్మ అలానే వుంది.

అమ్మ నన్నింతగా అమెరికా చదువులు చదివించకుండా, ఉద్యోగాలు చేయించకుండా వుంటే, అమ్మ చెంగుపట్టుకుని ఇంటి నాలుగ్గోడలు మధ్యే వుండిపోయి వుంటే, అమ్మ చూసిన వాడినే పెళ్లి చేసుకుని... అమ్మను సంతోష పెడుదును కదా అనిపిస్తుంది.

ఏ కారణంగా అయితేనేం అమ్మను బాధ పెట్టేను. అందుకు తగిన శిక్ష విధించు కున్నాను. నా బంగారు అమ్మను ఏడిపించి దూరం చేసుకున్నాక... నా జీవితంలో ఏ బిడ్డకీ అమ్మను కాగూడదనిపించింది. పిల్లలంటే నాకు ఎంతో ముద్దు అయినప్పటికీ... పిల్లలను కనగూడదని గట్టి నిర్ణయం తీసుకున్నాను. 'మరోసారి ఆలోచించు' అన్నాడు అబ్బూ. ఇక ఆలోచించేది లేదు అన్నాను. పిల్లల్ని కనడం ఎందుకు? వాళ్లతో పడరానిపాట్లు పడటం ఎందుకు? బాధను కొని తెచ్చుకోవడం ఎందుకు? ఏ మిత్రుల పిల్లలనయినా ఎత్తుకొని ఎంజాయ్ చేయవచ్చు.

నన్నూ, అబ్బూని తన పెళ్లికి రమ్మని గోపి గట్టిగా పట్టుపట్టేడు. అమ్మ, నాన్నల నుంచి ఆహ్వానం లేదు. అబ్బూ రావడానికి ధైర్యం చేయలేక పోయేడు. నేను మాత్రం మొండిగా, ఆశగా వచ్చేను. మిమ్మల్నందరినీ చూసేను. ఫర్లేదు. పందిట్లో నాన్నను చూసినట్టే. బహుశా అమ్మ కళ్లు గప్పి నాన్న ఏదోకసమయంలో చూడటానికి రావొచ్చు అనుకుంటున్నాను.

నా బంగారు అమ్మను మిస్ కావడమే నన్ను బాధిస్తోంది. అసలు నేను ఆశగా వచ్చింది అమ్మను చూడాలనే.

సాధారణంగా తల్లిదండ్రులు నాలా ప్రవర్తించే పిల్లలపై కోపంతో, బాధతో దూరమైనా కొంతకాలానికి అందరూ ఆనందంగా కలసిపోతారు. కోపాలు, పంతాలు, గుండె గాయాలు కాలగర్భంలో కలిసిపోతాయి. దురదృష్టవశాత్తూ నా విషయంలో నా బంగారు అమ్మ మూడేళ్ల తర్వాత కూడా అలానే వుంది. ఉదయం అమ్మ నాపై చేసిన విలయ తాండవం మీరు చూసేరుగా...

తర్వాత నాకెందుకో గొంతు పెగల్లేదు. కన్నీళ్లు ఆగలేదు.

మా పెద్దమ్మ నా వద్దకు వచ్చి, నన్ను దగ్గరకు తీసుకొని ఓదార్చింది.

''అమ్మా! గౌతమీ. మీ అమ్మ మాట దురుసే గాని... నీవన్నట్టు మీ అమ్మ బంగారు అమ్మే. ఉదయం నీ పట్ల తన ప్రవర్తన ఏ మాత్రం సబబుగా లేదని మందలించేను. నన్ను పట్టుకుని బావురుమని ఏడ్చింది తెల్సా''.

పెద్దమ్మ మాటలు నాకు కొంత ఉపశమనం కలిగించేయనాలి.

నేను చెప్పినదంతా బంధువులు ఓపిగ్గా విన్నారు. నా కన్నీళ్లు చూసి కాబోలు... మళ్లీ ఎవరూ నిరసన ప్రశ్నలు వేయలేదు.

మా బంధువులంతా నాతో కొంత సమయం గడిపినందుకు సంతోషించేను. వాళ్లకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియ జేసేను. అమెరికా నుంచి తెచ్చిన చిన్నచిన్న బహుమతులు అందజేసాను. స్త్రీలందరికీ నుదుట బొట్టుపెట్టి, పట్టు చీరలను సగౌరవంగా ఇచ్చేను. అందరినీ తృప్తి పరిచేను.

'ఇంటి ఆడపడుచువి. నీవు లేకుండా పెళ్లి ఏమిటీ. పద మాతో బయల్దేరు. మీ అమ్మకి నచ్చచెప్పే పూచీ మాది' అని నన్ను తీసుకు వెళ్లడానికి బలవంతం చేసేరు కొందరు.

నేను ఒప్పుకోలేదు. అమ్మ పిలిస్తే తప్ప రాలేనన్నాను.

తర్వాత, బంధువులంతా వెళ్లిపోయేరు.

గోపి కూడా కళ్లనీళ్లతో కదిలేడు.

''ఒరే. అమెరికా నుంచి వచ్చి కూడా. అక్క పెళ్లికి రాలేని పరిస్థితుల్లో వుందనీ వెధవ సెంటిమెంట్‌తో మనసు పాడుచేసుకోకు. నేను వుంటానుగా. రేపు ఏదొక సమయంలో మీ శ్రీమతిని తీసుకురా. ముగ్గురం కలిసి కాసేపు కబుర్లు చెప్పుకుందాం'' అంటూ వాడిని ఆత్మీయంగా దగ్గరకు తీసుకొని శుభాకాంక్షలు తెలిపేను .

గోపి కూడా వెళ్లిపోవడంతో గదిలో నేను ఒంటరిదాన్నయ్యేను. నాకెందుకో విపరీతంగా దుఃఖం వచ్చింది. మరోవైపు జెట్‌లాగ్ ప్రభావం వల్ల నిస్సత్తువతో, అలస



## బెడ్‌రూమ్ లేదు!

కొన్ని విషయాలను వింటుంటే ఆశ్చర్యంగా ఉంటుంది. అదీ మనం బాగా అభిమానించే వారి గురించి మరీ ఎక్కువగా ఊహించుకున్నప్పుడు ఆశ్చర్యం రెట్టింపవుతుంటుంది. ఇంతకీ చెప్పొచ్చే విషయం ఏమిటంటే ప్రముఖ యువ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్‌కు ఇంతవరకు వాళ్ళింట్లో ప్రత్యేకంగా గది అంటూ లేదట. ఈ విషయాన్ని ఆ మధ్య ఆయనే చెబుతూ ''నాకోసం ప్రత్యేకంగా గదిలేకపోవడం గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. అది అంత ముఖ్యమైన విషయం అని కూడా నేనెందుకో అనుకోలేదు. ఈ మధ్య అమ్మ ఈ విషయాన్ని గుర్తుచేస్తే 'అవును కదా' అనిపించింది. నాకైన అభిరుచులతో ప్రత్యేకంగా ఓ గదిని అలంకరించుకోవాలన్న ఆలోచన ఈ మధ్యనే వచ్చింది. దానికోసం త్వరలోనే ఏర్పాట్లు చేసుకుంటాను'' అని అన్నారు. ఫోన్‌కు వాడే చార్జర్ల నుంచి... చిన్నపాటి ఎలక్ట్రానిక్ వస్తువు ఏదైనా దేవిశ్రీ కంట్లో పడితే దాన్ని వెంటనే కొనుగోలు చేసేయడం ఆయనకున్న మరో అలవాటట. ఆయన సేకరించిన చార్జర్ల లిస్టు కూడా పెద్దదేనట.

టతో మంచంపై నడుం వాల్చి నిద్రపోయేను.

***

నేను నిద్రలే చేటప్పటికి ఇంకేముంది? తెల్లగా తెల్ల వారిపోయింది.

ఛ ఏమిటిది? నాపై నాకే చిరాకు వేసింది.

అర్ధరాత్రప్పుడు పెళ్లి ముహూర్తం. ఆ సమయంలో గోపికి సెల్‌లో విష్ చేద్దామనుకున్నాను. రాత్రి గోపి నాతో మాట్లాడే ప్రయత్నం చేసాడనేది. మిస్‌డ్ కాల్స్ వల్ల తెలుస్తోంది.

ముందుగా టీ తాగి, గోపికి కాల్ చేసేను.

'అక్కా.. అరగంటలో వస్తున్నాను' అంటూ ఫోన్ కట్ చేసేడు గోపి.

ఈలోగా కాలకృత్యాలు కానిచ్చి ఫ్రెష్ అయ్యేను.

గోపీ వస్తానన్న టైమ్‌కి వచ్చేడు. ఒక్కడూ కాదూ. సతీసమేతంగా.

జంట చూడచక్కగా వుంది. పరమానందంతో, లోనికి ఆహ్వానించేను.

వాళ్లు మొదట రాగానే చేసిన పని ఏమిటంటే అక్షింతలు నాచేతిలో పెట్టి నా కాళ్లకు నమస్కరించేరు. అక్షింతలు ప్రేమపూర్వకంగా వేసి... ఇద్దరినీ దగ్గరకు తీసుకున్నాను. వాళ్ల కోసం ప్రత్యేకంగా తెచ్చిన బహుమతులను అందచేసాను. ఎంతగానో ఆనందించేరు.

తర్వాత గోపి గతరాత్రి పెళ్లిలో జరిగిన కొన్ని విషయాలు చెప్పేడు. మా బంధు వర్గం నా దగ్గరకు వచ్చి, వెళ్లిన తర్వాత మా అమ్మపై ఎంతో ఒత్తిడి తెచ్చేరట.

''గౌతమి ఎలా జీవిస్తే నీకెందుకు? ఎవరి జీవితం వాళ్లది. మన పిల్ల హాయిగా బతుకుతోందికదా. ఎవర్ని చేసుకుంటే మనకెందుకు? ఈ కాలం పిల్లలు మనకన్నా ఉన్నతంగా ఆలోచిస్తున్నారు. తమకు తోచిన రీతిలో వెళ్తున్నారు. మధ్యలో మనందూరి మన అభిప్రాయాలు, నమ్మకాలు, ఆచారాలు వాళ్లపై రుద్ది బాధ పెట్టగూడదు. మనం బాధ పడగూడదు.

తలెత్తుకోలేని పని నీ కూతురుచేసిందో లేదో గాని నీవు మాత్రం చేస్తున్నావు. తమ్ముడి పెళ్లికి వచ్చిన ఆడపడుచుని గడప తొక్కనీయ కుండా అవమానించడం ఎంతమాత్రం సబబు కాదు. పెళ్లికి మేము ఎంత పిలిచినా రాలేదు పిల్ల. నీవు పిలిస్తేనే వస్తుందట. అంచేత నీవు వున్న పాటున బయల్దేరి గౌతమిని తీసుకురా' అని అన్ని విధాల ఒత్తిడి తెచ్చారు.

ఒత్తిడికి లొంగి, అమ్మ నిన్ను పెళ్లికి తీసుకు రావడానికి బయల్దేర లేదు. అలాగని బంధువులతో వాదనకూ దిగలేదు. పూర్తిగా మౌనం. తర్వాత ఏడుస్తూ వాళ్ల మధ్య నుంచి వెళ్లిపోయింది' అని చెప్పేడు గోపి.

నాకు చాలా బాధ అనిపించింది.

అమ్మ నాకు అర్థం కాలేదు. నేను ఏ నలుగురి మధ్య తలెత్తుకోలేని పని చేశానన్నదో... ఆ నలుగురూ నా తరపున నిలిచి, అమ్మకు నచ్చచెప్పినా వినిపించుకోలేదంటే ఆశ్చర్యంగా వుంది. అమ్మ హృదయం అంత పాషాణమా?

***

నెల రోజులు నా బంగారు అమ్మతో గడుపుదామని వచ్చేను. తీవ్ర నిరాశ, నిస్పృహతో నాలుగు రోజులకే అమెరికా వెళ్లిపోతున్నాను. గోపికీ సెలవు దొరక్కపోవడంతో తను పనిచేస్తున్న కంపెనీకి బెంగుళూరు నిన్ననే వెళ్లిపోయేడు. పాపం వాడు నన్ను వదిలి వెళ్లలేక వెళ్లేడు. 'ఫర్వాలేదు రా. నేను వెళ్ళిపోగలను' అని ధైర్యం చెప్పేను. నాకు తోడుగా నాన్న అమ్మని కాదని రాలేడుగా.

అమెరికా బయల్దేరుతున్న దాన్ని బయల్దేరనివ్వకుండా ''మీ అమ్మకి బై చెప్పిరా'' అని సలహా ఇచ్చేడు నా అబ్బూ ఫోన్‌లో.

అమ్మో! మళ్లీ ఆ గుమ్మం తొక్కగలనా?

''ఫర్వాలేదు. వెళ్లు. తిట్టినా, కొట్టినా, అవమానించినా మీ అమ్మే కదా. ధైర్యంగా వెళ్లు వెళ్లడం నీ ధర్మం. నీ సాహసమే నీకు రక్ష. ఆల్ ద బెస్ట్'' అన్నాడు అబ్బూ.

మంచి ఆలోచనే. నా అబ్బూ శుభచింతనతో పరిణత మార్గం చూపేడు. అమ్మ ఇంటికి అత్యుత్సాహంగా కదిలేను. నాలో ఎక్కడ లేని తెగింపు. ధైర్యం.

***

అమ్మ ఇంటిముందు కారులోంచి నేను దిగేటప్పుడు సమయం పది దాటింది. ఎండ తీవ్రత లేదు. వాతావరణం ప్లజెంట్‌గానే వుంది.

నాలుగు రోజుల క్రితం కళకళలాడిన పందిరి... ఈ రోజు నిరాడంబరంగా నిలబడి నన్ను ఆహ్వానించింది.

పందిరిలోంచి ఇంటిలోపలికి ప్రవేశిస్తుంటే 'ఆగు' అంటూ ఎలాంటి పెనుకేకలు పిడుగులు నాపై పడలేదు.

పిడుగులు పడినా, ప్రళయం వచ్చినా... లెక్క చేసేది లేదు. ఆగేది లేదు. ఏ విధంగానైనా సరే అమ్మ దగ్గరకి చేరి తీరుతాను.

కూతురు మూడేళ్ల క్రితమే చచ్చిపోయింది అనుకుంది అమ్మ. తను చచ్చినా సరే ఈ ఇంటి గుమ్మం నేను తొక్కడానికి వీల్లేదని ఆదేశించింది అమ్మ. ఐడోంట్ కేర్.

నా ఇంట్లోకి అడుగు పెట్టేను. ఆ స్వాతంత్రం లేదా నాకు?

చిత్రంగా... ఇంట్లో అలికిడి లేదు. అమ్మ అరుపులు లేవు.

అమ్మ ఇంట్లో లేదా.

నాన్న కన్పించేడు. హాలులో ఒక మూలన కూర్చొని పేపరు చదువు తున్నాడు. ఈ మధ్యే రిటైర్ అయ్యేడు. నన్ను చూసి నిర్ఘాంతపోయేడు నాన్న.

'ఎందుకొచ్చేవు' అనలేడు. 'వెళ్లిపో' అనలేడు.

నా పిచ్చి నాన్న శుద్ధ సౌమ్యుడు. నాన్నకాళ్లకు భక్తిపూర్వకంగా నమస్కరించి, అమెరికా వెళ్లిపోతున్న విషయం తెలియజేసేను. 'క్షేమంగా వెళ్లు తల్లీ' అని దీవించేడు.

''అమ్మ లేదా'' అని అడిగేను

'వుంది' అనకుండా, అమ్మ ఎక్కడ వున్నదీ చప్పుడు చేయకుండా చూపించేడు నాన్న.

అప్పటికే అమ్మ బెడ్ రూమ్ నుంచి నా వైపు చూస్తోంది!

తుళ్లిపడ్డాను. మరుక్షణం తేరుకున్నాను.

తనివి తీరా, మనసారా చూసేను. ఆ ప్రశాంత గంభీర వదనం. నా పై ప్రసరిస్తున్న తల్లి చూపుల్లో ఏదో అద్భుతమైన చల్లదనం.

నా బంగారు అమ్మ ఉజ్వలమైన ముఖ వర్చసుకి నా శరీరమంతా జలదరించగా, పులకరించగా, అమ్మను చేరి కాళ్లపై పడిపోయేను. కన్నీళ్లతో అభిషేకించేను.

''నిజానికి నేను వచ్చింది తమ్ముడి పెళ్లికోసం కాదమ్మా. నిన్ను చూడాలనే వచ్చేను. ఎట్టకేలకు చూసేను. అమ్మా! ఈ రోజు అమెరికా వెళ్లి పోతున్నాను. అది చెప్పడానికే వచ్చేను. నిన్ను ఇబ్బంది పెడితే క్షమించమ్మా. వస్తాను'' అన్నాను.

అమ్మకి నమస్కరించి, వెళ్లిపోతుంటే–

''ఆగు'' అంది అమ్మ.

ఆగేను. వెనుతిరిగేను.

అమ్మ కళ్లు వర్షిస్తున్నాయి!

అమ్మ చేతులు పిలుస్తున్నాయి!

ఇక ఏమని వర్ణింతును నా స్థితిని!

నా బంగారు అమ్మ ఒడిలో మళ్లీ చంటి బిడ్డనై పోయేను.

ఏకంగా నెల రోజులు వాయిదా పడింది నా అమెరికా ప్రయాణం.

*

రచయిత సెల్ నెం: **93913 81601**



## తనకి తెలుసు!

చిరునవ్వులు చిందించే స్నేహ కోలీవుడ్‌లో సరదాగా గడుపుతోంది. తను ఇంతవరకు పనిచేసిన హీరోల గురించి ఆ మధ్య చెప్పుకొచ్చింది. వారందరిలోకీ తనను బాగా ఆకట్టుకున్న వ్యక్తి అంటూ సుమంత్ గురించి ఓ రహస్యాన్ని చెప్పింది. ''సుమంత్ సెట్‌లో చాలా కామ్‌గా ఉంటారు. కొన్నాళ్ళు కలిసి పనిచేస్తే గానీ హీరోయిన్లతో కలిసిపోయి మాట్లాడరు. దానికన్నా నాకు అతనిలో నచ్చిన మరో విషయం ఉంది. ఏసీ, టీవీ, ఫ్రిజ్... ఒకటేమిటి ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించిన అన్ని వివరాలను సుమంత్ ఇట్టే చెప్పగలుగుతారు. అందుకే నాకు ఎప్పుడు ఈ విషయాల్లో డౌట్ వచ్చినా, కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన విషయాలను గురించి సందేహం వచ్చినా సుమంత్‌కు ఫోన్ చేస్తుంటాను'' అని గుట్టువిప్పింది స్నేహ. అన్నట్టు స్నేహ ఏ పండుగనూ మిస్ కాదు. షూటింగ్ నిమిత్తం ఎక్కడున్నా సరే పూజ సమయానికి ఫోన్ ఆన్ చేసి కూర్చుంటుంది. పూజగదిలో ఆమె తల్లి చేసే పూజనంతా విన్న తర్వాతే షాట్‌కు వెళ్తుంది.